సాక్షి
నల్లగొండ
శుక్రవారం । 22 । ఆగస్టు । 2025



వచ్చే నెలలో చేనేత రుణమాఫీ
వచ్చే నెలలో చేనేత రుణమాఫీ డబ్బులు జమవుతాయని ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ తెలిపారు. - 8లో



మిత్రుడి కోసం..
కాలిఫోర్నియాలో స్థిరపడిన వ్యక్తి 30 ఏళ్ల తర్వాత స్నేహితుడిని కలుసుకునేందుకు కోదాడకు వచ్చాడు. - 8లో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం : 590 అడుగులు		
ప్రస్తుత నీటి మట్టం	:	583.10 అడుగులు
ఇన్‌ఫ్లో	:	4,32,065 క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	:	4,32,065 క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	:	32,683 క్యూసెక్కులు
కుడికాల్వ ద్వారా	:	9,019 క్యూసెక్కులు
ఎడమకాల్వ ద్వారా	:	6,401 క్యూసెక్కులు
ఏఎమ్మార్పీకి	:	2,400 క్యూసెక్కులు
వరద కాల్వకు	:	300 క్యూసెక్కులు

న్యూస్‌రీల్

వయోవృద్ధుల సంక్షేమానికి అనేక చట్టాలు



మాట్లాడుతున్న జిల్లా జడ్జి నాగరాజు

రామగిరి(నల్లగొండ) : వయోవృద్ధుల సంక్షేమానికి న్యాయ వ్యవస్థలో అనేక చట్టాలు ఉన్నాయని జిల్లా ప్రధాన న్యాయమూర్తి నాగరాజు అన్నారు. ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా జిల్లా న్యాయ సేవా సదన్‌లో ఏర్పాటు చేసిన వయోవృద్ధుల న్యాయ అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వయోవృద్ధుల సంరక్షణకు న్యాయ వ్యవస్థ కృషి చేస్తుందన్నారు.అనంతరం సీనియర్ సిటిజన్స్‌ను సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ పురుషోత్తమరావు, ఫ్యామిలీ కోర్టు జడ్జి దుర్గాప్రసాద్, మహిళా కోర్టు జడ్జి కవిత, జిల్లా సంక్షేమ అధికారి కృష్ణవేణి, జిల్లా పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటరెడ్డి, చీఫ్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ సభ్యుడు ఎన్.బీమార్జున్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏటీసీ ద్వారా యువతకు నైపుణ్య శిక్షణ

నల్లగొండ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ), ఐటీఐలో యువతకు ఉపాధి కల్పించేలా నైపుణ్య శిక్షణ ఇస్తామని డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తగా 6 కోర్సులు ప్రవేశపెట్టామని.. ప్రస్తుతం ఉన్న పరిశ్రమల్లో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ ఆధారంగా ఈ కోర్సులు పూర్తి చేసిన వారికి దేశీయంగా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని పేర్కొన్నారు. నల్లగొండలోని ప్రభుత్వ పాత ఐటీఐ, కొత్త ఐటీఐ, అనుముల, డిండి ఐటీఐలలో రోజూ ఉదయం 12 గంటలలోపు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కోర్సుల్లో చేరేందుకు ఆసక్తి ఉన్నవారు పదో తరగతి మెమో, ఆధార్‌కార్డు, బోనఫైడ్, టీసీ, కుల ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలని సూచించారు.

వృద్ధులు, వికలాంగులు, బాలికలతో కొత్త సంఘాలు

నల్లగొండ : సెర్ప్ ద్వారా ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం కింద కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసే కార్యక్రమంలో భాగంగా కొత్త మహిళా సంఘాలు ఏర్పాటు చేస్తున్నట్లు డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 60 ఏళ్లు పైబడిన మహిళలు 10 నుంచి 15 మందిని కలిపి ఒక సంఘంగా ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. వికలాంగులకు ప్రత్యేకంగా, 13 నుంచి 15 ఏళ్ల వయస్సు వరకు, 15 ఏళ్ల నుంచి 18 ఏళ్ల వయస్సు కలిగిన కిషోర బాలికల సంఘాలు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు.

భక్తిశ్రద్ధలతో తీజ్ వేడుకలు



తీజ్ సంబరాల్లో గిరిజనులు

కొండమల్లేపల్లి : మండలంలోని గౌరికుంటతండాలో తీజ్ వేడుకలను గురువారం గిరిజనులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా తొమ్మిది రోజుల పాటు పూజలు చేసిన మొలకల బుట్టలను యువతులు తలపై ఎత్తుకొని గిరిజన సంప్రదాయ నృత్యాలతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం మొలకల బుట్టలను చెరువులో వదిలారు. వేడుకల్లో గ్రామపెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

డైరెక్ట్ ఏజెంట్ల నియామకానికి దరఖాస్తులు

రామగిరి(నల్లగొండ) : నల్లగొండ పోస్టల్ డివిజన్ పరిధిలో పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ (పీఎల్ఐ), రూరల్ పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ (ఆర్‌పీఎల్ఐ) డైరెక్ట్ ఏజెంట్ల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సూపరింటెండెంట్ కె.రఘునాథస్వామి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 50 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న వారు కనీసం 10వ తరగతి ఉత్తీర్ణత అర్హత కలిగి మార్కెటింగ్, సేల్స్, ఫైనాన్షియల్ అనుభవం కలిగిన వారికి ప్రాధాన్యం ఉంటుందని పేర్కొన్నారు. ఇంటర్వ్యూ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తామని తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు తమ బయోడేటా, వయస్సు ధ్రువీకరణ పత్రం, విద్యార్హత సర్టిఫికెట్, గుర్తింపు పత్రాల ప్రతులు జతచేసిన దరఖాస్తును నల్లగొండ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీస్ డివిజన్ కార్యాలయంలో ఈ నెల 28వ తేదీ లోపు సమర్పించాలని సూచించారు.

యూరియా కష్టాలు

- వరి, పత్తి పంటలకు ఒకేసారి అవసరం
- యూరియా కోసం పీఏసీఎస్‌ల వద్ద రైతుల బారులు
- అరకొర సరఫరాతో తప్పని ఇబ్బందులు
- ఒక్కోచోట రైతుకు మూడు బస్తాల చొప్పున పంపిణీ
- క్యూలో ఉన్నా యూరియా అందక నిరాశతో వెనుదిరిగిన కొందరు రైతులు



కట్టంగూర్‌లో పీఏసీఎస్ గోదాం ఎదుట యూరియా కోసం బారులుదీరిన రైతులు

సాగు పనులు ఊపందున్న వేళ అన్నదాతలకు ఎరువుల కష్టాలు తప్పడం లేదు. సరిపడా యూరియా నిల్వలు లేక రైతాంగం అష్టకష్టాలు పడుతోంది. వారం రోజులుగా అడపాదడపా వర్షాలు కురవడం, కాల్వల కింద ఆయకట్టుకు నీటిని విడుదల చేస్తుండడంతో సాగు పనులు ఊపందుకున్నాయి. దీంతో వరి, పత్తి సాగు చేసే రైతులకు ఒకేసారి యూరియా అవసరం ఏర్పడింది. కానీ రైతుల అవసరాలకు సరిపడా యూరియా సరఫరా లేకపోడంతో రైతులు తాము సాగు చేసిన పంటలను కాపాడుకునేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. ఒక్క బస్తా దొరికినా చాలు అన్న విధంగా రైతులు రోజుల తరబడి పీఏసీఎస్‌ల ఎదుట నిరీక్షిస్తున్నారు. గురువారం జిల్లాలోని పలు పీఏసీఎస్‌ల వద్ద యూరియా కోసం రైతులు బారులుదీరారు. గంటల కొద్దీ వేచి ఉన్నా కొందరికి యూరియా అందకపోవడంతో నిరాశతో వెనుదిరిగారు. ప్రభుత్వం సరిపడా యూరియా సరఫరా చేయాలని కోరుతున్నారు.

కొత్తపల్లిలో ఒక్కో రైతుకు మూడు బస్తాలే..
హాలియా : హాలియా మండలంలోని కొత్తపల్లి వ్యవసాయ సహకార సంఘానికి గురువారం 20 మెట్రిక్ టన్నుల (444 బస్తాలు) యూరియా వచ్చిందన్న సమాచారం తెలుసుకున్న వివిధ గ్రామాల రైతులు, మహిళలు, చిన్నారులు గురువారం ఉదయం నుంచే పీఏసీఎస్ వద్ద ఎగబడ్డారు.

నిరాశతో వెనుదిరిగిన రైతులు
కట్టంగూర్ : కట్టంగూర్ పీఏసీఎస్ గోదాముకు గురువారం ఉదయం 11 గంటలకు గోదాముకు 333 యురియా వచ్చింది. అప్పటికే రైతులు ఆధార్‌కార్డులు, పాస్‌బుక్‌లను క్యూలో ఉంచారు. పీఏసీఎస్ సిబ్బంది, ఏఓ గిరిప్రసాద్ పోలీసుల సహకారంతో రైతుకు ఒక్క బస్తా చొప్పున యూరియా పంపిణీ చేశారు. 200 మందికి పైగా రైతులు యూరియా అందకపోవడంతో నిరాశతో వెనుదిరిగిగారు. రెండు వారాల్లో 600 మెట్రిక్ టన్నుల యూరియా వస్తుందని ఏఓ తెలిపారు.

ఎక్కువ మంది రైతులు రావడంతో పీఏసీఎస్ సిబ్బంది.. ఏడీఏ సరిత, సీఐ సతీష్‌రెడ్డికి సమాచారం అందించారు. సీఐ సతీష్‌రెడ్డి సిబ్బందితో అక్కడికి చేరుకుని రైతులను వరుసలో నిలబెట్టి టోకెన్ల ప్రకారం పంపారు. యూరియా తక్కువగా ఉండడంతో ఒక్కో రైతుకు కేవలం మూడు బస్తాలు మాత్రమే ఇచ్చారు. అయినా సరిపోకపోవడంతో చాలా మంది రైతులు నిరుత్సాహంతో వెనుదిరిగారు.

తాటికల్ గోదాం వద్ద బారులు
నకిరేకల్ : నకిరేకల్‌లోని తాటికల్ పీఏసీఎస్ గోదాం ముందు గురువారం రైతులు, మహిళలు ఉదయం నుంచే బారులుదీరారు. 330 బస్తాల యూరియా



నార్కట్‌పల్లిలోని పీఏసీఎస్ ముందు పోలీస్ సిబ్బందితో మాట్లాడుతున్న రైతులు

నిల్వ ఉండడంతో పీఏసీఎస్ సిబ్బంది పోలీసుల సహకారంతో రైతులకు యూరియా అందించారు. ఒక్కో రైతులకు మూడు బస్తాలు మాత్రమే ఇవ్వడంతో కేవలం 110 మంది రైతులకు పరిపోయింది. దీంతో మరో 200 మంది రైతులు గోదాం వద్ద ఆందోళనకు దిగారు. మరో రెండు రోజుల్లో 15 టన్నుల యూరియా వస్తుందని.. రైతులకు పూర్తిస్థాయిలో అందిస్తామని పీఏసీఎస్ సిబ్బంది హామీ ఇవ్వడంలో రైతులు వెనుదిరిగారు.

నార్కట్‌పల్లిలో ఆందోళన
నార్కట్‌పల్లి : నార్కట్‌పల్లి పీఏసీఎస్‌కు గురువారం యూరియా వచ్చింది. కానీ రైతులకు ఇవ్వలేదు. దీంతో ఆగ్రహం వ్యక్తం చేసిన రైతులు సీఏసీఎస్ ఎదుట ఆందోళన చేశారు. పోలీసులు అక్కడికి చేరుకుని సర్దిచెప్పడంతో ఆందోళన సద్దు మనిగింది.

148 మంది రైతులకే..
శాలిగౌరారం : శాలిగౌరారం పీఏసీఎస్‌కు గురువారం 20 టన్నుల (444 బస్తాలు) యూరియా వచ్చింది. దీంతో రైతులు ఎగబడ్డారు. పోలీసుల పహరాలో క్యూలైన్‌లో వచ్చిన ఒక్కో రైతుకు మూడు బస్తాల చొప్పున యూరియాను అందించారు. కేవలం 148 మంది రైతులకే యూరియా వచ్చింది. దీంతో లైన్‌లో నిలుచున్న చాలా మంది రైతులు నిరాశతో వెనుదిరిగారు.

ఉదయం 6 గంటల నుంచే బారులు
త్రిపురారం : తిపురారం మండలంలోని త్రిపురారం, పెద్దదేవులపల్లి, బాబుసాయిపేట ప్రాథమిక సహకార సంఘాలకు గురువారం యూరియా వచ్చిందని తెలుసుకున్న రైతులు ఉదయం 6 గంటల నుంచి బారులుదీరారు. దీంతో సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. పోలీసుల పర్యవేక్షణలో ఒక్క ఆధార్ కార్డుకు మూడు యూరియా బస్తాలు పంపిణీ చేశారు. అయినా చివరి రైతులకు యూరియా అందకపోవడంతో పలువురు రైతులు నిరాశగా వెనుదిరిగారు.



శాలిగౌరారం పీఏసీఎస్ వద్ద ..



త్రిపురారం పీఏసీఎస్ వద్ద ..

ఇందిరమ్మ ఇళ్లను గ్రౌండింగ్ చేయాలి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

నల్లగొండ : నల్లగొండ నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్ల గ్రౌండింగ్‌ను పెంచాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. గురువారం నల్లగొండ మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నియోజకవర్గ పరిధిలోని ఇందిరమ్మ ఇళ్ల పురోగతిపై గృహనిర్మాణ శాఖ అధికారులు, తహసీల్దార్లతో కలెక్టర్ సమీక్షించారు. అసెంబ్లీ నియోజకవర్గానికి 3500 ఇళ్లు కేటాయించగా, మొదటి, రెండో విడతలో 3337 గృహాలు మంజూరు చేశామని.. అందులో 1129 గ్రౌండింగ్ కాగా.. బేస్మెంట్ స్థాయిలో 1,037, రూఫ్ లెవెల్‌లో 67, పూర్తయ్యే దశలో 25 ఇళ్లు ఉన్నాయని గృహ నిర్మాణ శాఖ పీడీ రాజ్‌కుమార్ వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ మండలాల ప్రత్యేక అధికారులు, గృహ నిర్మాణ ఇంజనీర్లు, ఎంపీడీఓలు ప్రత్యేక శ్రద్ధ వహించి ఇళ్ల గ్రౌండింగ్‌ను పెంచాలన్నారు. గృహాలు నిర్మించుకునేందుకు సుముఖత లేని లబ్ధిదారుల నుంచి సమ్మతి తీసుకోవాలని సూచించారు. పూర్తయిన గృహాలను మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ద్వారా ప్రారంభోత్సవం చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. నల్లగొండ మున్సిపాలిటీతో పాటు కనగల్, తిప్పర్తి మండలాల్లో ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశాలకు ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. మంజూరైన గృహాలు గ్రౌండింగ్ అయ్యేలా చూడాల్సిన బాధ్యత ఎంపీడీఓలపై ఉందని, ఈ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే తగు చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ నారాయణ్ అమిత్, ఆర్డీఓ వై.అశోక్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లు జాతీయస్థాయిలో రాణించాలి



రన్నింగ్ పోటీలు ప్రారంభిస్తున్న ఎంజీయూ రిజిస్ట్రార్ అలువాల రవి

నల్లగొండ టూటౌన్ : ఎన్ఎస్ఎస్ వలంటీర్లు జాతీయస్థాయిలో రాణించి మహాత్మాగాంధీ యూనివర్సిటీ ఖ్యాతిని చాటాలని ఎంజీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ అల్వాల రవి అన్నారు. వెస్ట్ జోన్ ప్రీ రిపబ్లిక్ పరేడ్ -2025 కోసం ఎంజీయూ పరిధిలోని ఎన్ఎస్ఎస్ వలంటీర్ల ఎంపిక గురువారం యూనివర్సిటీలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ రీజినల్ యూత్ ఆఫీసర్ సైదానాయక్ వలంటీర్లకు రన్నింగ్ పరేడ్ పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన వారికి ఇంటర్వ్యూలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎంపికైన వలంటీర్లను గుజరాత్‌లో జరిగే పీఆర్‌డీకి పంపిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంజీయూ ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ పసుపుల మద్దిలేటి, స్టేట్ ఎన్ఎస్ఎస్ అధికారి నరసింహ, సుధాకర్, ఆనంద్, శ్రీనివాస్, కాంతయ్య, దయానంద్, శ్యామల, మేనేశ్వరి, పావని, శృతి తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ అసిస్టెంట్లకు హెచ్‌ఎంలుగా పదోన్నతి

నల్లగొండ : ప్రభుత్వ, జిల్లా పరిషత్ పాఠశాలో పనిచేసే స్కూల్ అసిస్టెంట్లకు సీనియార్టీ ప్రాతిపదికన హెడ్ మాస్టర్లుగా పదోన్నతి కల్పించారు. ఈ మేరకు విద్యాశాఖ రీజినల్ డైరెక్టర్ పదోన్నతుల ఉత్తర్వులను గురువారం రాత్రి విడుదల చేశారు. పదోన్నతుల ప్రక్రియ గతనెలలోనే నిర్వాహించారు. అయితే.. కోర్టు ఆదేశాలతో ఆ ప్రక్రియ నిలిచిపోయిన విషయం తెలిసిందే. ప్రస్తుతం అన్ని అడ్డంకులు తొలగడంతో బుధవారం రాత్రి వెబ్ ఆప్షన్లు, గురువారం ఉదయం పోస్టింగ్ ఆప్షన్లు ఇచ్చారు.గురువారం రాత్రి 8 గంటలకు హెడ్‌మాస్టర్లుగా పదోన్నతి కల్పిస్తూ ఆర్‌జేడీ ఆన్‌లైన్ ద్వారా ఉత్తర్వులు జారీ చేశారు. హెచ్‌ఎంలుగా పదోన్నతి పొందన వారు శుక్రవారం విధులో చేరాల్సి ఉంటుంది. జిల్లాలో మొత్తం 56 హెచ్‌ఎం పోస్టులు ఖాళీ ఉండగా 4 స్కూళ్లలో జీరో ఎన్‌రోల్‌మెంట్ ఉంది. దీంతో 52 పోస్టులను పదోన్నతులతో నింపారు. ఎస్‌జీటీ నుంచి స్కూల్ అసిస్టెంట్ల పదోన్నతికి సంబంధించి రీషెడ్యూల్ విడుదల చేశారు. 22 నుంచి 24 వరకు సీనియార్టీ జాబితాపై అభ్యంతరాలు స్వీకరణ, 25న వెబ్ ఆప్షన్లు, 26న పదోన్నతులు కల్పించనున్నారు.

దళారులతో మంత్రులు కుమ్మక్కు


- యూరియా అందించడంలో ప్రభుత్వం విఫలం
- సంపాదన పైనే సీఎం, మంత్రుల దృష్టి
- మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి విమర్శ



మాట్లాడుతున్న మాజీమంత్రి జగదీష్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్ : యూరియా కొరత వెనుక కొందరు మంత్రులు, అధికారులు దళారులతో కుమ్మక్కయ్యారని మాజీమంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. గురువారం నల్లగొండలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నెల రోజులుగా యూరియా కొరత రైతులను తీవ్రంగా వేధిస్తోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులు నిద్రాహారాలు మాని, యూరియా కోసం చెప్పులు లైన్‌లో పెట్టుకునే పరిస్థితి తెచ్చిందన్నారు. గతంలో నల్లగొండ మంత్రి ధాన్యం కొనుగోళ్లలోనూ కమీషన్లు తీసుకుని రైతులను గాలికి వదిలేశారని ఆరోపించారు. 56 సార్లు ఢిల్లీకి వెళ్లిన సీఎం రేవంత్‌రెడ్డి కనీసం ఎరువులు తేలేడా అని ప్రశ్నించారు. ఢిల్లీకి వెళ్లి కాళ్లు పట్టుకొని పదవులు తెచ్చుకొనే కాంగ్రెస్ నేతలకు రైతుల సమస్యలపై పట్టింపులేదన్నారు. నల్లగొండ నియోజకవర్గంలో మంత్రి పూర్తిగా విఫలమయ్యారని, ధాన్యం కొనుగోళ్లు అంతే, నీళ్ల పరిస్థితి అంతే, ఇవ్వాల యూరియా కొరతపైనా అదే పరిస్థితి ఉందన్నారు. ఇద్దరు మంత్రులు దీపం ఉండగానే ఇల్లు చక్కపెట్టుకునే రీతిలో వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. నల్లగొండ నియోజకవర్గంలో సాగునీటి కోసం రైతులు రోడ్డు ఎక్కుతున్నారని.. ఈ విషయంలో మంత్రులు సిగ్గు పడాలన్నారు. ప్రతి ఎకరాకు కావాల్సిన యూరియా అందించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. ఎరువుల విషయంలో ప్రభుత్వానికి ముందస్తు సమీక్ష లేదని, ప్రైవేట్ దళారులతో కుమ్మక్కై అన్నదాతను అరిగోస పెట్టిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. యూరియా కొరత లేదని జిల్లా అధికారులు అబద్ధాలు చెబితే మీరే ఇబ్బందులు పడుతారని హెచ్చరించారు. కొరత లేదని చెప్పే అధికారులు రైతులకు ఎందుకు యూరియా ఎందుకు ఇవ్వడం లేదన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, గాదరి కిషోర్‌కుమార్, నిరంజన్ వలి, కటికం సత్తయ్యగౌడ్, మందడి సైదిరెడ్డి, చీర పంకజ్‌యాదవ్, సింగం రామ్మోహన్, అభిమన్యు శ్రీనివాస్, మాలె శరణ్యారెడ్డి, బోనగిరి దేవేందర్, జమాల్‌ఖాద్రీ, మారగోని గణేష్, పల్‌రెడ్డి రవీందర్‌రెడ్డి, నాగార్జున పాల్గొన్నారు.

మూసీకి కొనసాగుతున్న వరద



మూసీ గేట్లు ఎత్తడంతో దిగువకు పోతున్న నీరు

కేతేపల్లి : ఎగువన కురుస్తున్న వర్షాలతో మూసీ ప్రాజెక్టుకు వరద ఉధృతి కొనసాగుతోంది. గురువారం రాత్రి వరకు ఎగువ నుంచి మూసీ రిజర్వాయర్‌కు 6,835 క్యూసెక్కుల నీరు వస్తుండగా అధికారులు ప్రాజెక్టు ఏడు క్రస్ట్ గేట్లను రెండు అడుగుల మేర పైకెత్తి 5,949 క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు గరిష్ట నీటిమట్టం 645 అడుగులు (4.46 టీఎంసీలు) కాగా.. నీటిమట్టాన్ని 642.50 అడుగుల(3.79 టీఎంసీలు) వద్ద నిలకడగా ఉంచి ఎగువ నుంచి వస్తున్న వరదను దిగువకు వదులుతున్నామని అధికారులు తెలిపారు. మూసీ కుడి, ఎడమ కాల్వలకు 117 క్యూసెక్కుల నీటిని వదులుతున్నామని పేర్కొన్నారు.

కొత్తకార్డులకూ సన్నబియ్యం

- సెప్టెంబర్ 1వ తేదీ నుంచి పంపిణీ
- మొదటిసారి బియ్యం తీసుకోనున్న 44,099 కుటుంబాలు
- వారికి రేషన్‌తోపాటు అందనున్న ప్రభుత్వ పథకాలు
- ఏళ్లనాటి కల నెరవేరుతుండడంతో లబ్ధిదారుల హర్షం



రేషన్ దుకాణాలు 991	పాత కార్డులు 4,62,554
కొత్తవి 65,749	మొత్తం 5,28,303
గతంలో బియ్యం కోటా 89.15 లక్షల క్వింటాళ్లు	
వచ్చే నెల నుంచి కేటాయింపు 94.04 లక్షల క్వింటాళ్లు	

నల్లగొండ : రేషన్ కోసం ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న వారి కల నెరవేరనుంది. సెప్టెంబర్ 1వ తేదీ నుంచి సన్న బియ్యం అందజేసేందుకు ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. అయితే ఇటీవల కొత్తగా రేషన్ కార్డులు మంజూరైన వారికి కూడా రేషన్ బియ్యం అందించేందుకు యంత్రాంగం సిద్ధమవుతోంది. కొత్తగా కార్డులు వచ్చిన వారికి ఈ నెల నుంచి రేషన్ బియ్యంతోపాటు ప్రభుత్వ పథకాలు కూడా అందనున్నాయి. దీంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కొత్తగా 65,749 కార్డులు మంజూరు
కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జిల్లాలో కొత్తగా 65,749 కార్డులను మంజూరు చేసింది. 82,364 మంది పేర్లను కార్డుల్లో కొత్తగా నమోదు చేసింది. తొలుత మే 20వ తేదీ వరకు మీసేవ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకున్న అర్హులకు పౌరసరఫరాల అధికారులు కార్డులు మంజూరు చేసింది. దాంతో జూన్, జూలై, ఆగస్టు మాసాలకు సంబంధించిన బియ్యం జూన్‌లోనే ఒకేసారి ఇచ్చారు. దీంతో జిల్లాలో అప్పటి వరకు ఉన్న కార్డులతోపాటు కొత్తగా కార్డులు పొందిన 21,649 మంది సన్నబియ్యం తీసుకున్నారు. మే 20 తేదీ తరువాత రేషన్‌కార్డుల కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలించి అప్పటి నుంచి ఈనెల 13వ తేదీవరకు కొత్తగా మరో 44,099 కార్డులను మంజూరు చేసింది. అయితే వీరు జూన్, జూలై, ఆగస్టు మాసాల్లో కార్డులు పొందినప్పటికీ రేషన్ తీసుకునే అవకాశం దక్కలేదు. దాంతో సెప్టెంబర్ 1 నుంచి ఇచ్చే కోటాలో కొత్తరేషన్ కార్డుదారులు మొదటిసారిగా సన్న బియ్యం తీసుకోనున్నారు.

అందనున్న పథకాలు
రేషన్ కార్డులు జారీ చేయడంతో పేదలకు సమస్యలు తీరనున్నాయి. రేషన్ కార్డులేక ప్రభుత్వం ఇచ్చే ఉచిత బియ్యానికి దూరం కావడంతోపాటు పిల్లల చదువుల విషయంలోనూ ఇబ్బందులు ఎదురయ్యాయి. అంతే కాక ప్రభుత్వం ఏ సంక్షేమ పథకం పెట్టినా దానికి రేషన్‌కార్డు తప్పనిసరి చేయడంతో చాలా మంది ఆ పథకాలకు దూరమయ్యారు. అంతే కాక ప్రభుత్వం ఆరోగ్యశ్రీ ద్వారా ఇచ్చే వైద్య సేవలను కూడా పొందలేక ఇబ్బందులు పడ్డారు. ప్రస్తుతం కార్డులు జారీ చేయడంతో వారి సమస్యలు తీరనున్నాయి.

కార్యాలయాలకు క్యాడర్ కేటాయింపు

నల్లగొండ : కొత్తగా ఏర్పాటు చేసిన ఆర్డీఓ, తహసీల్దార్ కార్యాలయాలకు ప్రభుత్వం క్యాడర్‌ను కేటాయించింది. జిల్లాలో కొత్తగా ఏర్పాటైన చండూరు ఆర్డీఓ కార్యాలయానికి ఆర్డీఓతోపాటు 14 మంది క్యాడర్‌ను మంజూరు చేసింది. ఇక్కడ ఆర్డీఓ, డీఏఓ, డిప్యూటీ స్టాటిస్టికల్ ఆఫీసర్, సీనియర్ అసిస్టెంట్లు, మండల రెవెన్యూ అధికారి పోస్టులు 4, జూనియర్ అసిస్టెంట్లు 2, జూనియర్ స్టెనో గ్రాఫర్, డ్రైవర్, రికార్డ్ అసిస్టెంట్లు, అటెండర్లు ఇద్దరిని మొత్తం 14 మందిని మంజూరు చేశారు. కొత్త ఏర్పడ్డ గుడిపల్లి మండలానికి తహసీల్దార్‌తోపాటు 13 క్యాడర్ పోస్టులను మంజూరు చేసింది. ఇక్కడ తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్, ఇద్దరు ఆర్ఐలు, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్, ఒక టైపిస్టు, మండల సర్వేయర్, ఏఎస్ఓ, ముగ్గురు అటెండర్లు, ఒక చైన్‌మెన్‌ను పోస్టులను మంజూరు చేశారు. అయితే ఆయా కార్యాలయాలు ఇప్పటికే ప్రారంభమై నడుస్తున్నాయి. అక్కడ పని చేస్తున్న ఉద్యోగుల పోస్టును అధికారికంగా మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న స్వదేశీ జాగరణ్ మంచ్ సభ్యులు

రామగిరి(నల్లగొండ) : స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించాలని విదేశీ వస్తువులను నిషేధించాలని స్వదేశీ జాగరణ్ మంచ్ జిల్లా కన్వీనర్ వినోద్ హిందుస్తానీ అన్నారు. గురువారం నల్లగొండలోని రామగిరి నుంచి గడియారం సెంటర్ వరకు విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమెరికా, చైనా, టర్కీ మొదలైన విదేశీ వస్తువులను వాడకూడదని, మన దేశ ఉత్పత్తులనే వాడి, దేశ జీడీపీని పెంచి, ఇక్కడి పరిశ్రమలకు దన్నుగా నిలవాలన్నారు. విదేశీ వస్తువుల వినియోగాన్ని తగ్గించడం, చైనా, టర్కీ వంటి శత్రు దేశాల వస్తువులు, సేవలను బహిష్కరించడం విదేశీ విశ్వవిద్యాలయాల్లో చదువుకు బదులుగా భారత విద్యా వ్యవస్థను బలోపేతం చేయడం ఇప్పుడు ఎంతో అవసరం అన్నారు. ప్రతి భారతీయుడు 'స్వదేశీ సురక్షా ఔర్ స్వావలంబన్ అభియాన్'లో భాగమై, స్వదేశీ ఆచరణతో భారతాన్ని మళ్లీ మహోన్నత దేశంగా తీర్చిదిద్దే కర్తవ్యాన్ని స్వీకరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో విద్యార్థి నాయకులు పొట్టిపాక నాగరాజు, ఆవుల సంపత్, అమల, లక్ష్మి, శ్రీదేవి, మణికుమార్, హరీష్, బన్నీ, జయంత్, రుత్విక్, లక్ష్మీనివాస్, శ్రీకాంత్, వంశీ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎంజీయూలో అధ్యాపకులకు శిక్షణ

నల్లగొండ టూటౌన్: మహాత్మాగాంధీ యూనివర్సిటీలో అధ్యాపకుల నైపుణ్యాలను పెంపొందించేందుకు గురువారం యూనివర్సిటీలో ఇన్లిప్ నెట్ సంస్థ ప్రతినిధి అర్షద్‌ఖాన్ శిక్షణ ఇచ్చారు. లెర్నింగ్ మేనేజ్‌మెంట్ సిస్టంపై ఆన్‌లైన్ కోర్సులు రూపొందించుట, విద్యా సంబంధిత విషయాలను విద్యార్థులకు అందుబాటులో ఉంచే విధానాలు, పరిశోధనలు, వాటి ప్రచురణలు తదితర అంశాలపై ఆన్‌లైన్ ద్వారా అవగాహన కల్పించారు. ఇన్లిప్ నెట్‌లో విశ్వవ్యాప్తంగా జరిగే అధునాతన పరిశోధనలు అందుబాటులోకి రావడం వలన అధ్యాపకులు తమ నైపుణ్యాలను మెరుగుపర్చుకుంటూ విద్యార్థులకు బోధించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంజీయూ రిజిస్ట్రార్ అలువాల రవి, మిర్యాల రమేష్, శ్వేత, శ్రీలక్ష్మి, వివిధ కళాశాలల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపిక



పోలంపల్లి వసంత్‌గౌడ్

మునగాల: మునగాల మండలం ఆకుపాముల గ్రామానికి చెందిన పోలంపల్లి సురేష్‌గౌడ్, సుజాత దంపతుల కుమారుడు వసంత్‌గౌడ్ జాతీయ స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికయ్యాడు. వసంత్ గౌడ్ నల్లగొండ జిల్లా పెద్దవూర మండలం చలకుర్తి గ్రామంలోని జవహర్ నవోదయ విద్యాలయంలో 8వ తరగతి చదువుతున్నాడు. ఇటీవల ఏపీలోని ఏలూరులో జరిగిన అండర్-14 హైదరాబాద్ రీజియన్ నవోదయ విద్యాసమితి క్రికెట్ సెలక్షన్స్‌లో వసంత్‌గౌడ్ పాల్గొని 15రోజుల రీజినల్ క్రికెట్ శిబిరానికి ఎంపికయ్యాడు. ఈ శిబిరంలో ఉత్తమ ప్రతిభ కనబరిచి ఈ నెల చివరి వారంలో హర్యానా రాష్ట్రంలో జరగనున్న నవోదయ క్రీడా సమితి జాతీయ స్థాయి అండర్-14 క్రికెట్ పోటీలకు ఎంపికయ్యాడు. తన తండ్రి సురేష్‌గౌడ్, కోదాడ క్రికెట్ అకాడమీ కోచ్ షేక్ సిద్ధిక్ ప్రోత్సాహం, ఎస్‌వీఎస్ పాఠశాల, నల్లగొండ యాజమాన్యం సహకారంతో జాతీయ స్థాయికి ఎంపికైనట్లు వసంత్‌గౌడ్ పేర్కొన్నాడు. వసంత్‌గౌడ్ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబర్చాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలంపల్లి సుధాకర్‌గౌడ్ ఆకాంక్షించారు.

వాగులో కొట్టుకుపోయి రైతు మృతి



రాంమూర్తి (ఫైల్)

నిడమనూరు: పొలానికి వెళ్తూ వాగులో కొట్టుకుపోయి రైతు మృతిచెందాడు. ఈ ఘటన నిడమనూరు మండలం సూరేపల్లి గ్రామంలో గురువారం వెలుగులోకి వచ్చింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. సూరేపల్లి గ్రామానికి చెందిన ఆవుల రాంమూర్తి(55) మంగళవారం సాయంత్రం తన వ్యవసాయ పొలానికి వెళ్తూ మార్గమధ్యలో హాలియా వాగులో కొట్టుకుపోయాడు. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు అతడి ఆచూకీ కోసం గాలిస్తుండగా.. గురువారం వాగు వెంట చెట్ల పొదల్లో రాంమూర్తి మృతదేహం లభ్యమైంది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు.

గుండెపోటుతో జూనియర్ అసిస్టెంట్ మృతి



జియావుద్దీన్ (ఫైల్)

గరిడేపల్లి: గరిడేపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జూనియర్ అసిస్టెంట్ జియావుద్దీన్(55) గురువారం విధి నిర్వహణలో ఉండగా గుండెపోటుతో మృతిచెందారు. ఆయన స్వస్థలం నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి కాగా.. అక్కడి నుంచి ఆయన బదిలీపై గరిడేపల్లికి వచ్చి అద్దె ఇంట్లో ఉంటూ గత మూడేళ్లుగా ఇక్కడ పనిచేస్తున్నారు. జియావుద్దీన్ మృతి పట్ల పాఠశాల సిబ్బంది సంతాపం వ్యక్తం చేశారు.

అడ్డంకులు వచ్చినా ఆగేది లేదు..

చిట్యాల: వినాయకచవితికి హైదరాబాద్ నుంచి భారీ గణపతి విగ్రహాలను పెద్దఎత్తున వాహనాల్లో మండపాలకు తరలిస్తున్నారు. హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై చిట్యాల పట్టణ శివారులోని రైల్వే అండర్‌పాస్ ఎత్తు తక్కువగా ఉండడంతో వాహనాల్లో భారీ విగ్రహాలను తరలించడానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో అండర్‌పాస్ అవతలివైపే వాహనాల్లో నుంచి విగ్రహాలను క్రేన్ సహాయంతో కిందకు దించి చక్రాలతో ట్రాలీలో విగ్రహాలను ఉంచి తాళ్ల సహాయంతో అండర్‌పాస్ కింద నుంచి ఇవతలి వైపు లాక్కొస్తున్నారు. అనంతరం క్రేన్ సహాయంతో మరలా విగ్రహాన్ని వాహనాల్లోకి ఎక్కించి తీసుకెళ్తున్నారు. ఈ క్రమంలో పలు విగ్రహాలు అండర్‌పాస్ బ్రిడ్జికి తగిలి ధ్వంసమవుతున్నాయి. అంతేకాకుండా విగ్రహాలను అండర్‌పాస్ కింద నుంచి తరలించే సమయంలో హైవేపై వచ్చే వాహనాలు ఆగిపోతుండడంతో ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్నాయి.



అండర్‌పాస్ కింది నుంచి విగ్రహాన్ని లాగుతున్న యువకులు



అండర్‌పాస్ నుంచి బయటకు వచ్చిన భారీ గణనాథుడు



క్రేన్‌తో విగ్రహాన్ని వాహనంలోకి ఎక్కిస్తున్న యువకులు

వచ్చే నెలలో చేనేత రుణమాఫీ

- రాష్ట్ర చేనేత, జౌళిశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్



పోచంపల్లి ప్రొడ్యూసర్ కంపెనీ షోరూంను ప్రారంభిస్తున్న శైలజా రామయ్యర్ తదితరులు

భూదాన్‌పోచంపల్లి: లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తికాగానే వచ్చే నెలలో చేనేత కార్మికుల ఖాతాల్లో చేనేత రుణమాఫీ డబ్బులు జమవుతాయని రాష్ట్ర చేనేత, జౌళిశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ తెలిపారు. భూదాన్‌పోచంపల్లిలో కేంద్ర ప్రభుత్వ సహకారంతో మాస్టర్ వీవర్, నేషనల్ మెరిట్ అవార్డు గ్రహీత తడక రమేష్ ఏర్పాటుచేసిన పోచంపల్లి ప్రొడ్యూసర్ కంపెనీ షోరూంను వీవర్స్ సర్వీస్ సెంటర్ రీజినల్ డైరెక్టర్ అరుణ్‌కుమార్‌తో కలిసి గురువారం ఆమె ప్రారంభించారు. అనంతరం శైలజా రామయ్యర్ మాట్లాడుతూ.. ప్రస్తుతం చేనేత రుణమాఫీ లబ్ధిదారుల ఎంపిక జరుగుతుందని, కొన్ని జిల్లాల్లో జిల్లాస్థాయి బ్యాంకర్ల తీర్మానాలు పూర్తి కాలేదన్నారు. జిల్లాల వారీగా వచ్చిన బ్యాంకర్ల తీర్మానాలు రాష్ట్రస్థాయిలో పూర్తిచేసి రుణమాఫీ చేస్తామని చెప్పారు. త్రిఫ్ట్ పథకంలో కొత్త పేర్లు మార్పులు, చేర్పులతో కాస్త ఆలస్యమైందని, జూన్ నెలకు సంబంధించి రూ.7 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. టెస్కో కొనుగోలు చేసిన పోచంపల్లి హ్యాండ్లూమ్ పార్కులో నెల రోజుల్లో నేచురల్ డై యూనిట్‌ను ప్రారంభించనున్నామని పేర్కొన్నారు. పర్యావరణహితమైన నేచురల్ డై విధానం అందుబాటులోకి వస్తే పోచంపల్లి ఇక్కత్‌కు మరింత గుర్తింపువస్తుందని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఐఐహెచ్‌టీని పోచంపల్లిలోనే ఏర్పాటు చేయాలని ఆదేశించారని, శిథిలావస్థకు చేరిన హ్యాండ్లూమ్ పార్కును పునర్నిర్మించి వచ్చే రెండేళ్లలో ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీని ఇక్కడే ఏర్పాటు చేస్తామని తెలిపారు. ప్రస్తుతం తాత్కాలికంగా ఐఐహెచ్‌టీని హైదరాబాద్‌లో నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. పోచంపల్లి ప్రొడ్యూసర్ కంపెనీ తెలంగాణలోనే మొదటి పైలెట్ ప్రాజెక్ట్ అని అన్నారు. చేనేత వస్త్రోత్పత్తులు, ఉపాధి, మార్కెటింగ్ అవకాశాలను పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రొడ్యూసర్ కంపెనీలను ప్రోత్సహిస్తోందని అన్నారు. షోరూమ్‌లో తెలంగాణలోని పోచంపల్లి ఇక్కత్, గద్వాల, సిద్దిపేట గొల్లభామ వస్త్రాలతో పాటు దేశంలో పేరెన్నికగన్న అనేక వస్త్రాల వెరైటీలను అందుబాటులో ఉంచడం అభినందనీయమన్నారు. తెలంగాణ ప్రభుత్వం కూడా డూప్లికేట్ చేనేత వస్త్రాలను అరికట్టేందుకు తెలంగాణ అథెంటిక్ లోగోలను అందజేస్తుందని, ఈ లోగోలను అతికించడం ద్వారా చేనేత వస్త్రాల నాణ్యత, వినియోగదారులకు నమ్మకం పెరిగి కొనుగోళ్లు పెరిగే అవకాశం ఉందన్నారు.

62 మంది అవార్డు గ్రహీతలకు పింఛన్లు మంజూరు..

65 సంవత్సరాలు దాటి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అవార్డు గ్రహీతలకు నెలకు రూ.8వేలు పింఛన్ ఇస్తున్నామని, ఈ సంవత్సరం రాష్ట్రం నుంచి 62 మందికి పింఛన్ మంజూరైందని వీవర్స్ సర్వీస్ సెంటర్ రీజినల్ డైరెక్టర్ అరుణ్‌కుమార్ అన్నారు. అవార్డు గ్రహీతల పిల్లలు హ్యాండ్లూమ్‌కు సంబంధించి కోర్సులు అభ్యసిస్తే వారికి ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో పాటు నెలకు రూ.5వేల స్కాలర్‌షిప్‌ను కేంద్ర ప్రభుత్వం అందజేస్తుందన్నారు. అంతేకాక 90శాతం సబ్సిడీతో ఎలక్ట్రానిక్ జకాట్ మిషన్లు, మగ్గాలు, ఆసు యంత్రాలు, హ్యాండ్లూమ్ ఎక్విప్‌మెంట్స్ అందజేస్తున్నామని పేర్కొన్నారు. ఈ పైలట్ ప్రాజెక్ట్ విజయవంతమైతే రాష్ట్రంలో మరో 42 షోరూంలు ఏర్పాటు చేసేందుకు కేంద్రం సుముఖతతో ఉందని తెలిపారు. ఇప్పటివరకు ఉమ్మడి జిల్లా నుంచి ప్రొడ్యూసర్ కంపెనీ ద్వారా 12మంది చేనేత కళాకారులను విదేశాలకు పంపించి అక్కడ ఎగ్జిబిషన్లు ఏర్పాటు చేసి మార్కెటింగ్ సదుపాయం కల్పించామని పేర్కొన్నారు. కొత్తగా బున్‌కర్ దీదీ పథకం కింద మహిళా చేనేత కార్మికులకు ముద్ర రుణాలు ఇప్పించడంతో పాటు వారికి నూలు అందించడం, మార్కెటింగ్ సదుపాయాలను కల్పిస్తున్నామన్నారు. చేనేత కార్మికుల వార్షిక ఆదాయం రూ.10లక్షలకు పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం పైలెట్ ప్రాజెక్ట్ కింద తెలంగాణను ఎంపిక చేయగా.. అందులో ఉమ్మడి జిల్లాను ఎంపిక చేశామని త్వరలో ఆ పథకాన్ని అమలు చేయనున్నామని వెల్లడించారు.

పోచంపల్లిలో ఉత్సవాలు నిర్వహించాలని వినతి

యునెస్కో చేత అంతర్జాతీయ అవార్డు పొందిన పోచంపల్లిలో ఉత్సవాలను నిర్వహించాలని, పోచంపల్లిలో నూలు డిపో ఏర్పాటు చేసి కేంద్రం ఇచ్చే సబ్సిడీని అమలు చేయాలని పోచంపల్లికి చెందిన చేనేత నాయకులు తడక వెంకటేశం తదితరులు ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. దీనిపై ఆమె సానుకూలంగా స్పందిస్తూ వెంటనే ఉత్సవాల డీపీఆర్ ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా చేనేత, జౌళిశాఖ ఏడీ శ్రీనివాస్‌రావు, చౌటుప్పల్ ఆర్డీఓ శేఖర్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్‌ఐ వెంకట్‌రెడ్డి, డీటీ రాజేశ్వర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మిత్రుడి కోసం కాలిఫోర్నియా నుంచి కోదాడకు..

- 30 ఏళ్ల తర్వాత స్నేహితుడిని కలుసుకున్న ఎన్‌ఆర్‌ఐ



పశు ఔషధ బ్యాంకుకు విరాళం అందజేస్తున్న ఎన్‌ఆర్‌ఐ సుధాకర్, చిత్రంలో పెంటయ్య

కోదాడరూరల్: తన మిత్రుడు మూగజీవాలకు చేస్తున్న వైద్య సేవలను సోషల్ మీడియాలో చూసి అమెరికాలోని కాలిఫోర్నియా నుంచి కోదాడకు వచ్చి ఆశ్చర్యానికి గురిచేశాడు ఓ ఎన్‌ఆర్‌ఐ. వివరాలు.. కోదాడ ప్రాంతీయ పశువైద్యశాలలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న డాక్టర్ పి. పెంటయ్య, హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ చప్పిడి సుధాకర్ 30 ఏళ్ల కిందట హైదరాబాద్‌లోని పశువైద్య కళాశాలలో కలిసి చదువుకున్నారు. చదువు పూర్తయిన తర్వాత పెంటయ్య కోదాడ ప్రాంతంలో పశువైద్యాధికారిగా పనిచేస్తుండగా.. సుధాకర్ ఉన్నత చదువుల కోసం అమెరికాకు వెళ్లి అక్కడే కాలిఫోర్నియాలో స్థిరపడ్డారు. డాక్టర్ పెంటయ్య కోదాడ పశువైద్యశాలలో రైతులకు ఉపయోగపడేలా పశుఔషధ బ్యాంకును ఏర్పాటు చేసి మూగజీవాలకు చేస్తున్న వైద్య సేవలను కాలిఫోర్నియాలో ఉంటున్న అతడి స్నేహితుడు సుధాకర్ సోషల్ మీడియాలో చూశాడు. పెంటయ్య ఫోన్ నంబర్ తీసుకున్న సుధాకర్ త్వరలో కలుస్తానని అడ్రస్, లోకేషన్ షేర్ చేయమని చెప్పాడు. కాలిఫోర్నియా నుంచి హైదరాబాద్‌కు వచ్చిన సుధాకర్ బుధవారం కోదాడకు వచ్చి తన మిత్రుడు పెంటయ్యను కలిసి సర్‌ప్రైజ్ ఇచ్చాడు. చాలా ఏళ్ల తర్వాత కలుసుకున్న ఇద్దరు స్నేహితులు ఆనందంలో మునిపోయారు. అనంతరం పశుఔషధ బ్యాంక్‌కు రివాల్వింగ్ ఫండ్ కింద రూ.20వేలు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా సుధాకర్‌తో పలు రకాల పండ్ల మొక్కలను నాటించారు.

యూరియా అందించడంలో ప్రభుత్వం విఫలం

- నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య



తాటికల్ పీఏసీఎస్ వద్ద రైతులతో మాట్లాడుతున్న చిరుమర్తి లింగయ్య

నకిరేకల్: రైతులకు సరిపడా యూరియా సరఫరా చేయడంలో ప్రభుత్వం విఫలమైందని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య విమర్శించారు. నకిరేకల్‌లోని తాటికల్ పీఏసీఎస్ వద్ద గురువారం ఉదయం యూరియా కోసం బారులుదీరిన రైతుల వద్దకు ఆయన చేరుకుని.. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చిరుమర్తి మాట్లాడుతూ.. రైతులు చంటిపిల్లలతో వచ్చి యూరియా కోసం క్యూ కడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు నష్టపోతున్నారని విమర్శించారు. గత కేసీఆర్ ప్రభుత్వం యూరియా కొరత లేకుండా చర్యలు తీసుకుందని గుర్తుచేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రధాని మోదీ కాళ్లు మొక్కి అయినా రైతులకు యూరియా అందించాలని డిమాండ్ చేశారు. లేందటే సీఎం పదవికి రాజీనామా చేయాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ప్రగడపు నవీన్‌రావు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ పల్‌రెడ్డి మహేందర్‌రెడ్డి, నాయకులు పెండెం సదానందం, గొర్ల వీరయ్య, సామ శ్రీనివాస్‌రెడ్డి, రాచకొండ వెంకన్నగౌడ్, పల్లె విజయ్, దైద పరమేశం తదితరులు ఉన్నారు.

సాంకేతిక కోర్సుల్లో ఉచిత శిక్షణ

- శిక్షణ కాలంలో ఉచిత హాస్టల్ వసతి

భూదాన్‌పోచంపల్లి: యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి మండలంలోని జలాల్‌పురంలో గల స్వామి రామానందతీర్థ గ్రామీణ సంస్థలో దీన్ దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన పథకం కింద తెలంగాణలోని నిరుద్యోగ యువతకు ఉపాధి ఆధారిత సాంకేతిక కోర్సులలో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు సంస్థ చైర్మన్ ఎన్. కిషోర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మూడున్నర నెలల కాల వ్యవధి గల అకౌంట్ అసిస్టెంట్ (ట్యాలీ) కోర్సుకు బీకాం, కంప్యూటర్ హార్డ్‌వేర్ అసిస్టెంట్ కోర్సుకు ఇంటర్మీడియట్, ఆటోమొబైల్ టూవీలర్ కోర్సుకు పదో తరగతి, సోలార్ సిస్టమ్ ఇన్‌స్టాలేషన్ అండ్ సర్వీస్ కోర్సుకు పదో తరగతి విద్యార్హత కల్గి ఉండాలని అన్నారు. అభ్యర్థులు 18 నుంచి 30 సంవత్సరాల వయస్సు కల్గి ఉండాలని సూచించారు. శిక్షణా కాలంలో ఉచిత భోజనం, హాస్టల్ వసతి కల్పించబడుతుందని పేర్కొన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు ఉద్యోగ అవకాశం కల్పిస్తామని చెప్పారు. ఆసక్తి కల్గిన అభ్యర్థులు తమ విద్యార్హతల సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోతో సెప్టెంబర్ 1న సంస్థలో నిర్వహించే కౌన్సిలింగ్‌కు హాజరుకావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 91339 08000, 91339 08111 నంబర్లను సంప్రదించాలన్నారు.

మిర్యాలగూడలో రామ్‌రాజ్ కాటన్ షోరూం ప్రారంభం



రామ్‌రాజ్ కాటన్ షోరూమ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ: మిర్యాలగూడ పట్టణంలోని సాగర్ రోడ్డులో రామ్‌రాజ్ కాటన్ షోరూమ్‌ను గురువారం స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి తన సతీమణి మాధవితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రామ్‌రాజ్ కాటన్ దుస్తులను దేశంలోని రాజకీయ నాయకులతో పాటు ప్రముఖ వ్యక్తులు ఎక్కువగా ఆదరిస్తున్నారని అన్నారు. దేశంలో ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాల్లో తెల్లటి దుస్తుల అమ్మకాల్లో రామ్‌రాజ్ కాటన్ పేరుగాంచిందన్నారు. కంపెనీ ప్రతినిధులు సరసమైన ధరలకు దుస్తులు అందించేలా కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో బిల్డింగ్ ఓనర్ రాము, రామ్‌రాజ్ కాటన్ షోరూం ఫౌండర్, చైర్మన్ కేఆర్. నాగరాజన్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్ చిలుకూరి రమాదేవి శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

తిరుమలగిరి(తుంగతుర్తి): ఇంట్లో నిద్రించిన మహిళ అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. ఈ ఘటన తిరుమలగిరి మండలం గుండెపురి గ్రామంలో గురువారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గుండెపురి గ్రామానికి చెందిన పాలకుర్తి కొమ్మ(60)కు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె సంతానం. కుమారులు ఇతర ప్రాంతాల్లో ఉండగా.. ఆమె ఒంటరిగా గ్రామంలోనే నివాసముంటోంది. బుధవారం రాత్రి గ్రామంలో జరిగిన పోలీస్ భరోసా కార్యక్రమానికి ఆమె హాజరై ఇంటికి వెళ్లి నిద్రించింది. రోజుమాదిరిగానే గురువారం ఉదయం పాల కోసం ఇంటి పక్కన వారు పిలువగా ఆమె బయటకు రాలేదు. ఇంట్లోకి వెళ్లి చూడగా మంచంపై విగతజీవిగా పడి ఉంది. ఆమె మెడపై ఉన్న బంగారు గొలుసు కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తూ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తుంగతుర్తి ఆస్పత్రికి తరలించారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



సోమనాథ్ ఉత్తమ్ గారడి మృతదేహం

మిర్యాలగూడ టౌన్: గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన బుధవారం రాత్రి మిర్యాలగూడ మండలం కొత్తగూడెం బస్టాండ్ వద్ద జరిగింది. మిర్యాలగూడ రూరల్-2 ఎస్‌ఐ సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రకు చెందిన సోమనాథ్ ఉత్తమ్ గారడి (27) దామరచర్లలోని యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో సూపర్‌వైజర్‌గా గత రెండేళ్లుగా పనిచేస్తున్నాడు. అనారోగ్యంతో బాధపడుతున్న అతడు బుధవారం రాత్రి మందుల కోసం మిర్యాలగూడకు వస్తుండగా.. మిర్యాలగూడ మండలం కొత్తగూడెం బస్టాండ్ వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు 108 వాహనంలో మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడి బంధువు సంతోష్ గురువారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించినట్లు పేర్కొన్నారు.

బీఎస్ఎన్ఎల్ ఫ్రీడమ్ ప్లాన్‌కు ప్రజాదరణ

రామగిరి(నల్లగొండ): స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని బీఎస్ఎన్ఎల్ ప్రవేశపెట్టిన ఫ్రీడమ్ ప్లాన్‌కు(రూ.1కి సిమ్) వినియోగదారుల నుంచి మంచి ఆదరణ లభించిందని బీఎస్ఎన్ఎల్ ఉమ్మడి జిల్లా ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ పి. వెంకటేశం అన్నారు. కేవలం ఒక్క రూపాయితో 30రోజుల పాటు అపరిమిత వాయిస్ కాల్స్, రోజుకు 2 జీబీ డేటాతో పాటు రోజుకు 100 మేసేజ్‌లు పొందవచ్చన్నారు. ఈ పథకం ఆగస్టు 31 వరకు అమలులో ఉంటుందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పులిచింతల నుంచి 13 గేట్ల ద్వారా నీటి విడుదల



మేళ్లచెరువు: చింతలపాలెం మండలంలోని పులిచింతల ప్రాజెక్టుకు గురువారం 4,28,513 క్యూసెక్కుల వరద నీరు వస్తుండగా.. 13 గేట్లను నాలుగున్నర మీటర్ల మేర ఎత్తి 4,13,205 క్యూసెక్కుల నీటిని అధికారులు దిగువకు వదులుతున్నారు. టీజీ జెన్‌కో 16,600 క్యూసెక్కుల నీటిని ఉపయోగిస్తూ నాలుగు యూనిట్ల ద్వారా 105మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

విద్యార్థి అదృశ్యం.. కేసు నమోదు

భువనగిరి: భువనగిరి మండలం అనంతారం గ్రామ పరిధిలోని శ్రీవాగ్దేవి డిఫెన్స్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థి కళాశాల నుంచి అదృశ్యమయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని ఓల్డ్ బేగంపేటకు చెందిన రాశి రితీష్‌యాదవ్ బుధవారం సాయంత్రం ఎవరికీ చెప్పకుండా శ్రీవాగ్దేవి డిఫెన్స్ కళాశాల నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. బంధువులు, తెలిసిన వారి ఇళ్లలో ఎంత వెతికినా అతడి ఆచూకీ లభించకపోవడంతో గురువారం తల్లిదండ్రులు భువనగిరి రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు భువనగిరి రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ అనిల్‌కుమార్ తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Services

ASTROLOGY

"Free" జ్యోతిష్యం మీ హస్త రేఖం ఫోటో చూసి జాతకం చెప్పబడును. స్త్రీ పురుష "వశీకరణ స్పెషలిస్ట్" ఇంకా ఎటువంటి సమస్యలు ఉన్న ఈ రోజు సంప్రదించండి సెల్: 6361790196. [SCA25007439]

HOUSE FOR SALE

Real Estate

2, 3 & 4BHK లగ్జరీ విల్లాలు. నివసించుటకు సిద్ధంగా ఉన్నాయి. రూ. 80 లక్షల నుండి, డీ-మార్ట్ పక్కన మిర్యాలగూడ, ఆధునిక సౌకర్యాలు, క్లబ్స్, స్విమ్మింగ్ పూల్. సంప్ర : Ph : 7013578378 [HA-422]

Wanted

ప్రముఖ హోంకేర్ సంస్థ Hydలో వృద్ధులకు, పేషెంట్లకు సేవచేయుటకు బేబీకేర్, ఇంటి/వంట పనికి స్త్రీ/పు. కావలెను. జీ : 18,000 to 24,000. రూం+మీల్స్ ఫ్రీ. 9347148051 [SCA25007401]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకు లను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

వరిలో కొత్త రకం కలుపు మొక్కలు

- పొలం చెడగొట్టి మళ్లీ దమ్ము చేస్తున్న రైతులు
- వ్యవసాయాధికారులు సూచనలు ఇవ్వాలని కోరుతున్న అన్నదాతలు




చిలుకూరులో పొలాన్ని చెడగొట్టి మళ్లీ దమ్ము చేస్తున్న రైతు

చిలుకూరు: ఈ ఏడాది వెదజల్లే పద్ధతిలో వరి సాగుచేసిన రైతులకు కలుపు మొక్కలు చుక్కలు చూపిస్తున్నాయి. గత కొన్నిరోజులుగా కురుస్తున్న వర్షాలకు పొలాల్లో వివిధ రకాల కలుపు మొక్కలు విపరీతంగా పెరిగాయి. ఏ మందులు పిచికారీ చేసినా కలుపు మొక్కలు చనిపోయే పరిస్థితి లేదు. వరి విత్తనాలు వెదజల్లిన 15 నుంచి 20 రోజుల వ్యవధిలో రైతులు ఒకసారి కలుపు మందులు పిచికారీ చేశారు. అయినా కలుపు మొక్కలు చనిపోలేదు. మరోసారి పిచికారీ చేసినా ఎలాంటి ప్రయోజనం కనిపించలేదని రైతులు చెబుతున్నారు. గతంలో లేని విధంగా ఈసారి కొత్త రకం కలుపు మొక్కలు పుట్టుకొస్తున్నాయని రైతులు అంటున్నారు.

కొత్త రకం కలుపుతో తంటాలు

వెదజల్లే పద్ధతిలో సాగు చేసిన వరి పొలాలను ప్రారంభంలో ఆరబెట్టడం, నీళ్లు పెట్టడం చేయడం వలన సాధారణంగానే కలుపు మొక్కలు మొలకెత్తుతాయి. గతంలో తుంగ, వంజ, నక్కలతోకల గడ్డి, దారక లాంటి కలుపు మొక్కలు కనిపించగా.. మొదటి 20 రోజుల్లో మందులు పిచికారీ చేయడం వల్లన వాటిని నివారించేవారు. ఈ ఏడాది కొత్తగా నకిలి వరి, గోధుమ రంగులో వంజ, ఎర్ర, తెల్ల వంజలు మొలకెత్తాయని రైతులు వాపోతున్నారు. ఇవి ఏ మందులు కొట్టినా చనిపోవడం లేదని అంటున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు వంజ రకం కలుపు విపరీతంగా పెరిగి అసలు వరి పైరు కనబడటం లేదని రైతులను ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత్యంతరం లేక చిలుకూరులో కొంతమంది రైతులు 30 నుంచి 35 రోజుల క్రితం వెదల్లే పద్ధతిలో సాగు చేసిన పొలాలను ట్రాక్టర్‌తో దున్ని మళ్లీ నాట్లు వేస్తున్నారు. దీని వల్లన రైతులు ఒక్కో ఎకరానికి రూ. 20వేలకు పైగా నష్టపోతున్నారు. చిలుకూరు నుండి దూదియాతండా రోడ్డులో చాలా మంది రైతుల పరిస్థితి ఇలాగే ఉంది. చిలుకూరు మండల వ్యాప్తంగా 70 శాతం మంది రైతులు ఈ ఏడాది వెదజల్లే పద్ధతిలోనే వరి సాగు చేశారు. ఇప్పటికైనా వ్యవసాయాధికారులు స్పందించి క్షేత్రస్థాయిలో పొలాలను పరిశీలించి సూచనలు ఇవ్వాలని రైతులు కోరుతున్నారు. నష్టపోయిన రైతులను గుర్తించి ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

పొలం మొత్తం మళ్లీ దున్నిస్తున్నా..



ఈ వెదజల్లే పద్ధతిలో వరి సాగు చేశాను. గతంలో మాదిరిగానే ఈసారి కూడా మొదటి 20 రోజులకు కలుపు మందులు పిచికారీ చేశా. అయినా అవి చనిపోలేదు. మళ్లీ వెంటనే రెండోసారి కూడా కలుపు మందులు పిచికారీ చేసినా ఫలితం లేదు. పొలంలో విపరీతంగా కొత్త రకం వంజ పుట్టింది. పొలం మొత్తం కమ్మేసింది. ఏమి చేయాలో అర్థంకాక పొలం మొత్తం మళ్లీ దమ్ము చేసి నాట్లు వేస్తున్నా.

– గుండు శ్రీను, కౌలు రైతు, చిలుకూరు